క్లుప్తంగా

'యువత పోరు'కు తరలిరావాలి

రాంబిల్లి(అచ్యుతాపురం): వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాంబిల్లి మండల అధ్యక్షుడు పిన్నమరాజు కిశోర్ ఓ ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలంలోని యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. ముందుగా రాంబిల్లిలోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన అనంతరం అనకాపల్లికి తరలి వెళ్తామని తెలిపారు.

యలమంచిలిలో సీపీఐ జిల్లా మహాసభలు


సీపీఐ జిల్లా మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

యలమంచిలి రూరల్: యలమంచిలిలో మే 5, 6, 7 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ కోరారు. మంగళవారం యలమంచిలిలో ఈ మేరకు మహాసభల కరపత్రాలను ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. సమ సమాజ స్థాపనే లక్ష్యంగా 1925 డిసెంబరు 26న సీపీఐ పురుడు పోసుకుందని బాలేపల్లి తెలిపారు. యలమంచిలిలో జరగనున్న జిల్లా మహాసభల్లో జిల్లాలో సామాజిక, రాజకీయ అంశాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజన్న దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు, రామనాయుడు, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

వసతి గృహమా.. పశువుల పాకా?


వసతి గృహం ప్రాంగణంలో కట్టిన పశువులు

ఎస్.రాయవరం: దార్లపూడి సంక్షేమ వసతి గృహ ప్రాంగణం పశువుల పాకగా దర్శనమిస్తోంది. దశాబ్దాల కాలం పాటు ఇక్కడ సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహం నిర్వహించేవారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో కొన్నేళ్ల క్రితం వసతి గృహాన్ని ఎత్తివేశారు. అప్పటి నుంచి ఈ భవనం, ముందు ప్రాంగణం నిరుపయోగంగా ఉంది. ఇది గమనించిన సమీప నివాసాల వారు ఈ ప్రాంగణంలో పశువుల పెంపకం చేపడుతున్నారు. మరికొందరు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారు. మండలంలో చాలీచాలని భవనాలతో నెట్టుకొస్తున్న కళాశాలలకు ఇటువంటి భవనాలు కేటాయిస్తే ప్రయోజనకరంగా ఉంటోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

శ్రీనివాసుని ఆలయ నిర్మాణానికి విరాళం


వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న భారతీదేవి

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో తలపెట్టిన శ్రీనివాసుని ఆలయ నిర్మాణానికి భక్తులు తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. గాజువాకకు చెందిన యల్లపు శ్రీరాములు జ్ఞాపకార్థం ఆయన భార్య భారతీదేవి రూ.25వేలు నగదును మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆడారి అచ్చియ్యనాయుడు, బొడ్డేడ రామునాయుడు, ఆడారి కాశీబాబు, ఆడారి పరశురామ్, రాజు, వెలగా వెంకటప్పారావు, ఆడారి గోవింద, తదితరులు పాల్గొన్నారు.

29 లీటర్ల సారా స్వాధీనం


ఆయా గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న నాటు సారా

పాయకరావుపేట: మండలంలోని రాజవరం, శ్రీరాంపురం, పాయకరావుపేట గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తుల నుంచి 29 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. నిందితులను యలమంచిలి కోర్టుకు తీసుకెళ్లగా.. అక్కడి నుంచి రిమాండ్ నిమిత్తం యలమంచిలి సబ్ జైలుకు తరలించామన్నారు.

నిరుద్యోగ భృతి ఊసే లేదు


డిగ్రీ, ఆపై చదువులు చదివినా ప్రభుత్వ ఉద్యోగాలు లేవు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు చొప్పున భృతి ఇస్తామని ఎన్నికల్లో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తూ ఇంకా ఆ పథకం అమలుకు నోచుకోలేదు. చదువుకున్న వారికి ఉద్యోగం అయినా ఇవ్వాలి.. లేదా చెప్పిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి అయినా ఇచ్చి ఆదుకోవాలి.
– అంగా అనూష, ఎంబీఏ, కొరుప్రోలు, ఎస్.రాయవరం మండలం

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఇబ్బందులు


ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం మోసం చేసింది. బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి. గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారు.
– గొల్లు నరేష్, ఎంబీఏ, కె.వెంకటాపురం, కోటవురట్ల మండలం

నిరుద్యోగ భృతిపై మాయమాటలే..


అధికారంలోకి రాకముందు సూపర్ సిక్స్ పథకాలు పేరుతో నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు అందజేస్తామని ఎన్నికల ముందు నమ్మబలికారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది మాసాలు కావస్తున్నా సరే యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, లేదా నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి అందజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కానీ అమలు చేయలేదు. రాష్ట్రంలో నిరుద్యోగులను మోసం చేశారు. గతంలో కూడా అధికారంలోకి రాకముందు ఇలాగే నిరుద్యోగులకు టోపీ వేశారు.
–మైచర్ల కుమార్ స్వామి, డిగ్రీ నిరుద్యోగ విద్యార్థి, అర్జునగిరి (చీడికాడ)


ఘాట్‌రోడ్డు కూలిన చోట తాత్కాలికంగా కట్టిన గోడ


ఇందేశమ్మవాక ఘాట్ రోడ్డు

విస్తరణ.. విస్మరణ

- ఇందేశమ్మవాక, సాబనాలకొండ ఘాట్ రోడ్లకు వందేళ్ల చరిత్ర
- విస్తరణకు నోచుకోక తరచూ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్య
- రక్షణ గోడలు కూలడంతో ప్రమాదకరంగా మారిన ప్రయాణం
- నదిలో అక్రమ ఇసుక తవ్వకాలతో కూలుతున్న ఘాట్‌రోడ్డు

మనసు పరవశించేలా వింతైన అనుభూతిని కలిగించే ఘాట్ రోడ్డు అది. కొత్తగా ప్రయాణించే వారికి పొరపాటున దారిమరిచిపోయి ఏజెన్సీకి వచ్చేశామా అన్న అనుమానం కలిగించే ఘాట్‌రోడ్డది. ఓ వక్క పచ్చని ఎత్తైన కొండ.. మరో వక్క లోయలో ఉన్నట్టు అనిపించే వరాహనది.. దానిని ఆనుకుని పచ్చని పరదా వేసుకుందా అన్నట్టున్న మరో కొండ.. ఇదీ ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డు ప్రత్యేకత. ఈ ఘాట్ రోడ్డులో మైమరచి కాస్త ముందుకెళితే మళ్లీ మరో ఘాట్‌రోడ్డు.. అదే సాబనాల కొండ ఘాట్‌రోడ్డు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందాల్సిన ఈ రెండు ఘాట్ రోడ్లు ప్రస్తుతం అసహనాన్ని కలగజేస్తున్నాయి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యపు నీడలో ఈ రెండు ఘాట్ రోడ్ల అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి.

కోటవురట్ల: **ఇందేశమ్మవాక, సాబనాలకొండ** ఘాట్ రోడ్ల **విస్తరణను కూటమి ప్రభుత్వం** విస్మరిస్తోంది. **కొన్నేళ్ల క్రితం వాహనదారులు** కాసేపు ఆగి ఫొటోలు దిగి, ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ వెళ్లేవారు. ఇపుడా పరిస్థితి లేదు. ఆహ్లాదకర వాతావరణం ఉన్నప్పటికీ కాసేపు అక్కడ వేచి ఉండి ఎంజాయ్ చేసే పరిస్థితులు లేవు. విపరీతంగా వాహనాల రాకపోకలు పెరగడంతో ఘాట్‌రోడ్డు ఇరుకుగా ఉన్న కారణంగా ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. దాంతో ఘాట్‌రోడ్డులో ఒక్క నిమిషం ఉండలేని పరిస్థితి ఉంది.

వందేళ్ల ఘాట్‌రోడ్డు

సుమారు వందేళ్లకు ముందు బ్రిటిష్ పాలకులు ఈ ఘాట్‌రోడ్డును నిర్మించారు. నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి ఏజెన్సీ ప్రాంతానికి రాకపోకలు సాగించేందుకు అనువుగా అప్పట్లో ఈ ఘాట్‌రోడ్డును నిర్మించారని చెబుతారు. అప్పటి వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఘాట్‌రోడ్డును నిర్మించగా ప్రస్తుతం విపరీతంగా వాహనాలు పెరిగినా అదే ఘాట్‌రోడ్డు దిక్కవుతోంది. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ ఘాట్ రోడ్లను పాలకులు, అధికారులు పూర్తిగా విస్మరించారు. దాంతో ప్రస్తుతం శిథిలమై ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తున్నాయి.

విస్తరణ మాటేది?

వాస్తవానికి ఇందేశమ్మవాక, సాబనాల కొండ ఘాట్ రోడ్లను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ విస్తరణ జోలికి ఎవరూ పోవడం లేదు. కనీసం 50 అడుగుల రోడ్డుగా విస్తరించి అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉంది. ఇక్కడి వాతావరణానికి అనుగుణంగా రోడ్డును విస్తరించి రక్షణ గోడ నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంతో పాటు కాసేపు సరదాగా సేదతీరేందుకు అవకాశం ఉంటుంది.

నిధులు ఉన్నా.. శంకుస్థాపనలతో సరి!

సాబనాల కొండ ఘాట్ రోడ్డు ప్రారంభం అల్లు**మియ్యపాలెం వెళ్లే రహదారి నుంచి ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు వరకు రహదారి** అభి**వృద్ధికి వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.24**.5 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో సుమారు 12 కిలోమీటర్ల మేర రహదారిని అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి శంకుస్థాపనలతో కాలయాపన చేస్తున్నారే తప్ప రోడ్డు పనులు మాత్రం జరగడంలేదు. రహదారి అభివృద్ధిలో భాగంగా ఘాట్‌రోడ్డు విస్తరణకు కూడా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా ప్రాచుర్యం పొందనుంది.

ఘాట్‌రోడ్లను విస్తరించాలి


సాబనాలకొండ, ఇందేశమ్మవాక ఘాట్ రోడ్లను విస్తరించి అభివృద్ధి చేయాలి. ఈ రెండు ప్రాంతాలు పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అయినా పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాహనాల రద్దీ బాగా పెరగడంతో తరచూ ట్రాఫిక్ సమస్య నెలకుంటోంది. రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరైనా పనులు చేయకపోవడం దారుణం.
– చీకట్ల జగదీష్, సర్పంచ్, పందూరు

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి


ఇందేశమ్మవాక ఘాట్ రోడ్డును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఇక్కడ ఆహ్లాదకర వాతావరణం, పర్యాటక కేంద్రానికి కావలసిన అన్ని వనరులు ఉన్నాయి. అధికారులు దృష్టి సారించి ఘాట్‌రోడ్డును కనీసం 50 అడుగులు విస్తరిస్తే బాగుంటుంది. సినిమా షూటింగ్‌లకు కూడా అనువైన వాతావరణం ఇక్కడ ఉంది.
– చవ్వాకుల చిన్న, రామచంద్రపురం

శిథిలమైన రక్షణ గోడ

ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డు రక్షణ గోడ మొత్తం శిథిలమై చాలా కోట్ల కూలిపోయింది. నదిలో అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా వరద సమయాలలో ప్రవాహం దిశ మారి ఘాట్‌రోడ్డు కోతకు గురై రెండు చోట్ల కుప్పకూలింది. అక్కడ తాత్కాలికంగా చిన్న గోడ కట్టి చేతులు దులిపేసుకున్నారు. ఘాట్ రోడ్డంతా పెద్ద గోతులు పడి దారుణంగా తయారైంది. అప్పుడప్పుడూ కొండపై నుంచి బండ రాళ్లు దొర్లుకు వచ్చి వాహనదారులను బేజారెత్తిస్తున్నాయి.


ఘాట్ రోడ్డులో కూలిన రక్షణ గోడ

పక్కాగా పీ-4 సర్వేకు చర్యలు

మునగపాక: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పీ-4 సర్వే పక్కాగా జరిగేలా చూడాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న పీ-4 సర్వే కచ్చితంగా శతశాతం జరిగేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు సర్వే వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. సర్వేకు సంబంధించి ఎక్కడైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. ఈవోఆర్డీ సోమరాజు, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాదరావు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఘనంగా పోలిపల్లెమ్మ పండగ


పోలిపల్లెమ్మను దర్శించుకుంటున్న భక్తులు


ఆకట్టుకున్న రేలారే రేలా

మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లిలో మంగళవారం పోలిపల్లెమ్మతల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అనకాపల్లి-పరవాడ మార్గంలో రాకపోకలు సాగించే పలువురు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రేలారే రేలా ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ బుద్ద రవిశంకర్, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఆస్తి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం చూపొద్దు


పన్ను వసూళ్ల గురించి మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు

యలమంచిలి రూరల్: ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం దగ్గర పడుతుండడంతో పురపాలక సంఘం పరిధిలో బకాయిల వసూలుపై నిర్లక్ష్యం చూపవద్దని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో పన్ను వసూళ్లపై ఆయన సమీక్ష జరిపారు. ఈ నెల 31వ తేదీలోగా వంద శాతం పన్ను వసూలయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరుకు అవసరమైన లక్ష్యం చేరుకోవాలని, ఇందు కోసం ఈ నెలాఖరులోగా రూ.47 లక్షల వరకు పన్ను వసూళ్లు చేయాల్సి ఉందని చెప్పారు. సచివాలయాల వారీగా ప్రభుత్వ, ప్రైవేటు భవనాల పన్ను ఎంత మేర వసూలు కావాల్సి ఉందో ఆయన సమీక్షించారు. గతేడాది పన్ను వసూళ్లలో తడబడడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాలేదని ఆయన చెప్పారు. దీని వల్ల మున్సిపాలిటీ భారీగా నష్టపోయిందని, ఈ సారైనా లక్ష్యం చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.4.40 కోట్ల పన్ను వసూలు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.2.52 కోట్లు వసూలైంది. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి టి.విశ్వేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.సంతోష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా ఉపమాక వెంకన్న కల్యాణం


ఉపమాక వెంకన్న కల్యాణోత్సవంలో తలంబ్రాల ఘట్టం


ఎదురు సన్నాహం అనంతరం రథోత్సవం

చూచుకొండ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ


పీహెచ్‌సీలో బాలింతతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవికుమార్

మునగపాక: మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) పి.రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ల్యాబ్‌తో పాటు మందుల పంపిణీ గదిని పరిశీలించారు. పీహెచ్‌సీలో డెలివరీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలింతలకు వైద్యపరంగా అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలన్నారు. సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సీజన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్తేర్‌రాణి, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గుర్రం శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ సువర్ణరాజు, హెల్త్ సూపర్‌వైజర్ బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్షయ నివారణ సాధ్యమే

అనకాపల్లి టౌన్: క్షయ వ్యాధిని ముందుగా గుర్తించి మందులు వాడితే నివారణ సాధ్యమేనని డాక్టర్ శ్రావణి తెలిపారు. స్థానిక అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం లక్షణాలు ఉన్నట్లయితే వైద్యులను సంప్రదించాలన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలి


పంచాయతీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఈవోఆర్డీ చంద్రశేఖర్

పాయకరావుపేట : తడి, పొడి చెత్త సేకరణపై పట్టణ వాసులకు అవగాహన కల్పించాలని ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. పాయకరావుపేట పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'


పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రబీ ఈ-పంట ఈకేవైసీ 100 శాతం పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏ కె.వీరబాబు, వీఏఏ జి.గోపీకృష్ణ, ఏపీసీఎస్‌ఎఫ్ పి.జోగారావు, రైతులు పాల్గొన్నారు.

సంఘాల నిర్వహణ పక్కాగా ఉండాలి


మహిళా సంఘాలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ

మునగపాక: సంఘాల బలోపేతంతో ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చునని డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ అన్నారు. తిమ్మరాజుపేటలో మంగళవారం మహిళా సంఘాలతో జరిగిన సమావేశంలో డైజీ మాట్లాడారు. పీఎం మోదీ ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టి సారించాలన్నారు. బ్యాంక్‌ల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. సంఘం లావాదేవీలు తేడాలేకుండా ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని చెప్పారు. అజెండా ప్రకారం సమావేశాలు నిర్వహిస్తూ ప్రగతి సాధించాలన్నారు. పుస్తక నిర్వహణ, ఆన్‌లైన్ చెల్లింపులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వెలుగు ఏపీఎం బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, బ్యాంక్ లింకేజ్ మేనేజర్ కుమారస్వామి, సీసీ రామకృష్ణ, విలేజ్ అసిస్టెంట్ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు


పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు


పాయకరావుపేట అధ్యక్షుడు చిక్కాల

కోటవురట్ల: మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం వద్ద ఈ వేడుక ఉదయం 8.30 గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అనుబంధ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

పాయకరావుపేట: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలకు అందరూ తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పాయకరావుపేట పట్టణంలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్దకు బుధవారం ఉదయం 8 గంటలకు హాజరు కావాలన్నారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం యువత పోరు కార్యక్రమంలో పాల్గొనేందుకు అనకాపల్లి కలెక్టరేట్‌కు తరలివెళ్లనున్నట్టు ఆయన తెలిపారు.

అచ్యుతాపురం: అనకాపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి మండలంలోని యువకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు పిలుపునిచ్చారు. ఉపాధి కల్పన, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

సీహెచ్‌బీ అగ్రహారంలో ఉపాధి పనుల పరిశీలన


సీహెచ్‌బీ అగ్రహారంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: మండలంలో సీహెచ్‌బీ అగ్రహారంలోని పెంద్యాల చెరువులో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించారు. చెరువులో పూడిక తీత, గట్టు పటిష్టం చేయడం వంటి పనులు చేపట్టారు. పనులకు వచ్చిన కూలీల మస్తర్లను తనిఖీ చేశారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. రాని వారి పేరున మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పనికి తగిన వేతనం గిట్టుబాటు అయ్యే విధంగా పనులు కల్పించాలన్నారు. కూలీలకు వేసవి అలవెన్సు కూడా ఇస్తామన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని పనులు జరిగే ప్రాంతాల్లో టెంట్లు, తాగునీరు సదుపాయం కల్పించాలని ఆయన సూచించారు. ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు జరిగే చోట అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆయన కాగితలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించి, వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు.